భూ సమస్యలు పరిష్కరించుకోండి

● సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోనిరూరల్: రీ–సర్వేలో నెలకొన్న భూ సమస్యలను గ్రామసభలలో అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ సూచించారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని బైచిగేరిలో రీ–సర్వేపై గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. అనంతరం సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ సమస్యలను విచారించి త్వరలోనే పరిష్కరిస్తామని చెప్పారు. భూ సమస్యలు ఉన్న రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అధికారులు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శివరాముడు, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణుసూర్య, అధికారులు పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ

మండలంలోని బైచిగేరి గ్రామంలోని గ్రామ సచివాలయాన్ని శుక్రవారం సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించిన అనంతరం సచివాలయ సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. సచివాలయానికి వచ్చే ప్రజల పట్ల మర్యాదపూర్వకంగా నడుచుకోవాలన్నారు. ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

పోస్టర్లు విడుదల చేసిన సబ్‌కలెక్టర్

ఆదోని రూరల్: ఆదోని సబ్‌కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే 21వ అఖిలభారత పశుగణన కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను శుక్రవారం సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశుసంవర్ధకశాఖ అందించే సేవలను పాడిపశువులు కలిగిన రైతులు, యజమానులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ రమణ, డాక్టర్లు వంశీకృష్ణ, ప్రదీప్‌కుమార్, వీఎల్‌ఓ సాయిబాబా, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



గ్రామసభలో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్



వాల్‌పోస్టర్లు విడుదల చేస్తున్న దృశ్యం

పశుగణనను విజయవంతం చేయండి

గోనెగండ్ల: మండలంలో జరిగే భారత పశుగణనను విజయవంతం చేయాలని పశుసంవర్ధకశాఖ ఏడీ వెంకటేష్ కోరారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపీడీఓ మణి మంజరి చేతుల మీదుగా పశుగణన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ.. మండలంలోని అన్ని గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి గేదెలు, ఆవులు, ఎద్దులు, గొర్రెలు, మేకలు, పందులు, గుర్రాలు, కోళ్లు, పక్షులు సహా 16 రకాల పెంపుడు జంతువుల సమాచారాన్ని సేకరించి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తామని తెలిపారు. పశుగణన పూర్తయిన ఇంటి తలుపుపై స్టిక్కర్ వేస్తారని చెప్పారు. ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. పశువైద్యురాలు ఇందిరా, ఈఓఆర్డీ అనంతసేన, సర్పంచ్ హైమవతి పాల్గొన్నారు.



పోస్టర్లను విడుదల చేస్తున్న ఎంపీడీఓ

రైతులకు అందుబాటులో ఉండాలి

ఆదోని రూరల్: వ్యవసాయ అధికారులు, సిబ్బంది రైతులకు అందుబాటు ఉంటూ సేవలు అందించాలని కర్నూలు ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డా.సుజాత, ఏడీఏ అరుణకుమారి సూచించారు. ఈ మేరకు శుక్రవారం ఆదోని డివిజన్ పరిధిలోని గ్రామ వ్యవసాయ సహాయకులు, విస్తరణ అధికారులకు శిక్షణా కార్యక్రమాన్ని స్థానిక కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పత్తి, వేరుశనగ, పప్పుశనగ పంటల్లో ఆధునిక వ్యవసాయ పద్ధతులు, ప్రస్తుత పంటల్లో ఎదుర్కొంటున్న తెగుళ్లు, పురుగుల నివారణ చర్యలను వివరించారు. రైతులు రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులనే వాడాలని సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త సుజాత

నేడు చేపల పెంపకం వేలం పాటలు

కోసిగి: పులికనుమ రిజర్వాయర్‌లో చేపల పెంపకానికి సంబంధించి శనివారం మండల కేంద్రం కోసిగి మండల పరిషత్ కార్యాలయంలో బహిరంగా వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు ఆదోని డివిజన్ మత్స్యశాఖ పర్యవేక్షకుడు నాగరాజు తెలిపారు. వేలం దక్కించుకున్న వ్యక్తులు 30–06–2025వ తేదీ వరకు రిజర్వాయర్‌లో మత్స్య సంపద పెంపకం చేసుకోవచ్చునన్నారు. వేలం పాటలో పాల్గొనేందుకు ఉదయం రూ.10వేలు డిపాజిట్ చేసి, ఆధార్ కార్డుతో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

జాబ్‌మేళాలో 19 మందికి ఉద్యోగాలు

ఎమ్మిగనూరుటౌన్: ఏపీ ప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ఎస్‌ఎంఎల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 19 మంది పలు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ, క్రెడిట్ యాక్సిస్ గ్రామీణ్ లిమిటెడ్ కంపెనీల ప్రతినిధులు నిర్వహించిన ఇంటర్వ్యూల్లో 50 మంది అభ్యర్థులు పాల్గొన్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ మహబూబ్‌బాషా తెలిపారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ క్రాంతికుమార్, ప్లేస్‌మెంట్ ఇన్‌చార్జ్ న్యూటన్‌రాజు, స్కిల్ హబ్ కోఆర్డినేటర్ సుధాకర్ పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తత అవసరం

గోనెగండ్ల: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు మురుగు నీరు నిల్వచేరి ప్రజలు రోగాల బారిన పడుతున్నారని డీఎంఅండ్‌హెచ్‌ఓ భాస్కర్ అన్నారు. శుక్రవారం గోనెగండ్లలో వైద్య సిబ్బంది ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంఅండ్‌హెచ్‌ఓ మాట్లాడుతూ.. దోమలు కుట్టడం వల్ల డెంగీ, మలేరియా, ఫైలేరియా వంటి వ్యాధులు ప్రబలుతున్నాయని తెలిపారు. నీటి కుంటలు, ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ చేరకుండా చూసుకోవాలని సూచించారు. ప్రతి శుక్రవారం బిందెలు, డ్రమ్ముల్లో నిల్వ ఉంచిన నీటిని ఖాళీ చేసి ఆరబెట్టిన తర్వాత నీటిని నింపుకోవాలని సూచించారు. ఇలా చేయడం వల్ల దోమల లార్వాలు నశిస్తాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించండి

గోనెగండ్ల: ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ భాస్కర్ వైద్య సిబ్బందికి సూచించారు. శుక్రవారం గోనెగండ్ల ప్రభుత్వ ఆస్పత్రిని తనిఖీ చేశారు. రికార్డులు, ఆస్పత్రి పరిసరాలు, గదులను పరిశీలించి వైద్య సేవలపై ఆరా తీశారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని.. సక్రమంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. ఆయన వెంట డాక్టర్లు రంగ రవళి, కార్తీక్ ఉన్నారు.



ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ భాస్కర్

సామాజిక తనిఖీ బహిరంగ విచారణ

ఆదోని రూరల్: 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆదోని మండలంలో 37 గ్రామ పంచాయతీలలో జరిగిన ఉపాధి హామీ సామాజిక తనిఖీ గత వారం రోజులుగా నిర్వహించారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక ఉపాధిహామీ కార్యాలయ ఆవరణలో మండల పోరం (సామాజిక తనిఖీ) కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డ్వామా పీడీ నాసరరెడ్డి, అడిషనల్ పీడీ మాధవీలత, ఎస్‌పీఎం పూనయ్య, డీవీపీ, ఏపీడీ లోకేశ్వర్, ఎంపీడీఓలు రాజేంద్రప్రసాద్, గీతావాణి, ఆస్పరి డీవీపీ శ్రీలత హాజరై బహిరంగ విచారణ చేపట్టారు. మండలంలో 2023–24 ఆర్థిక సంవత్సరానికి గానూ 2,850 పనులకు గానూ రూ.25.43 కోట్లు ఖర్చు చేసినట్లు అధికారులు తెలిపారు. ఇందులో ఆయా పనుల్లో జరిగిన అవకతవకలపై మండలంలో మొత్తం రూ.5,70,830 రికవరీ, రూ.1,32,300 ఫెనాల్టీ విధించినట్లు ఆదోని ఏపీఓ కాలిక్‌బాషా తెలిపారు.



ఆడిట్ వివరాలపై ఆరా తీస్తున్న పీడీ నాసరరెడ్డి

సదస్సులను సద్వినియోగం చేసకోండి

పెద్దకడబూరు : రీ సర్వేలో తలెత్తిన భూ సమస్యలు గ్రామసభల ద్వారా పరిష్కరిస్తామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు శ్రీనాథ్ సూచించారు. మండల పరిధిలోని జాలవాడి గ్రామంలో శుక్రవారం గ్రామ సభ నిర్వహించారు. రైతుల నుంచి తహసీల్దార్ వినతులు స్వీకరించారు.

యువకుడిపై కేసు నమోదు

ఆదోని అర్బన్: పట్టణంలోని హావన్నపేట కాలనీకి చెందిన అరుణ్‌బాషా ఓ బాలిక(12)తో అసభ్యకరంగా ప్రవర్తించి దుర్భాషలాడడంతో శుక్రవారం రాత్రి కేసు నమోదు చేసినట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు. బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అరుణ్‌బాషాపై కేసు నమోదు చేశారు.

డీఈఓను కలసిన ఏపీటీజీ నాయకులు

ఆదోని సెంట్రల్: జిల్లా విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన ఎస్.శామ్యూల్ పాల్‌ను కర్నూలు కార్యాలయంలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ టీచర్స్ గిల్డ్ రాష్ట్ర నాయకులు చిన్నప్ప, చంద్రశేఖర్, మరెన్న ఆదోని డివిజన్ నాయకుడు వెంకటేష్ తదితరులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల ఎదొర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని విన్నవించగా డీఈఓ సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు.

నదీ తీర ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నందవరం: ఎగువన కురిసిన వర్షాలకు టీబీ డ్యామ్ నుంచి వరద నీరు ప్రవహిస్తోందని, నదీ తీర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని జొహరాపురం, పెద్దకొత్తిలి గ్రామాల్లో తుంగభద్ర నదీ ప్రవాహాన్ని ఆయన పరిశీలించారు. ప్రజలు జాగ్రత్తంగా ఉండాలని సూచించారు. అలాగే పశువుల కాపర్లు, జాలర్లు, మహిళలు నదీ తీరం వైపు వెళ్లారాదని తెలిపారు. నీటి ఉధృతిని ఎప్పటికప్పుడు పరిశీలించాలని వీఆర్వోలను ఆదేశించారు. డీటీ మహేష్, ఆర్‌ఐ జెర్మియా, వీఆర్వో రమేష్ పాల్గొన్నారు.



నదీ ప్రవాహాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

సమస్యలపై వినతి

ఎమ్మిగనూరుటౌన్: మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు మెరుగైన వైద్యం అందించాలని, మెడికల్ అలవెన్స్‌లు మంజూరు చేయాలని సీఐటీయూ నాయకులు గోవిందు డిమాండ్ చేశారు. శుక్రవారం పారిశుద్ధ్య కార్మికులతో కలిసి మున్సిపల్ మస్టర్ కేంద్రాల వద్ద ధర్నా చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులుకు అందజేశారు. ఈఎస్‌ఐ వైద్యం కోసం కార్మికుల వేతనాల్లో ప్రతి నెలా రూ.360 కోత పెడుతున్నారని.. అయితే మెరుగైన వైద్యం మాత్రం అందించడం లేదని ఆరోపించారు. మెడికల్ అలవెన్స్‌లు, జాతీయ సెలవులు వర్తింపజేయాలని కోరారు. రాముడు, నాగరాజు, కేశన్న, తిక్కయ్య, రంగన్న పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి

ఆదోని రూరల్: శిక్ష అనుభవిస్తున్న ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని డిస్ట్రిక్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ లీలావెంకటశేషాద్రి సూచించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఆదోని పట్టణంలోని సబ్‌జైలును తనిఖీ చేశారు. ఖైదీల బరాక్స్, రేషన్ స్టోర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులు పడుతున్న ముద్దాయిలకు లీగల్ సర్వీసెస్ అథారిటీ తరపున ఉచితంగా న్యాయవాదిని నియమిస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి యజ్ఞ నారాయణ, సెకండ్ అడిషనల్ జూనియర్ కోర్టు జడ్జి శ్రీవల్లి, జైలు సూపరింటెండెంట్ నజీర్‌అహ్మద్, లీగల్ అడ్వకేట్ ఆనంద్ పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న లీలావెంకటశేషాద్రి

ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోండి

ఎమ్మిగనూరుటౌన్: టీచింగ్ స్టాఫ్‌ను వేధిస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ప్రైవేట్ టీచర్స్, లెక్చరర్స్ యూనియన్(పీఎల్‌టీయూ) జిల్లా అధ్యక్షుడు చాంద్‌బాషా కోరారు. ఈ మేరకు శుక్రవారం కర్నూలులో కలెక్టర్ రంజిత్ బాషాను కలిసి వినతిపత్రం అందజేశారు. యాజమాన్యాలు నిబంధనలకు విరుద్ధంగా సెలవు రోజుల్లో ఉపాధ్యాయులు, అధ్యాపకులతో పనులు చేయించుకుంటున్నారని తెలిపారు. వేతనాలు సక్రమంగా ఇవ్వడం లేదని పేర్కొన్నారు.

క్లుప్తంగా

విద్యుత్ బిల్లులు చెల్లించకుంటే కనెక్షన్ కట్

ఆదోని టౌన్: ఆదోని టిడ్కో సముదాయంలో పక్కా ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు విద్యుత్ బిల్లులను చెల్లించకపోవడంతో కనెక్షన్లు తొలగిస్తామని విద్యుత్‌శాఖ డీ–3 ఏఈ లోకేష్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ టిడ్కో సముదాయంలో విద్యుత్ కనెక్షన్ కోసం 4,720 మందికి గానూ మొదటి విడతగా 1,560 ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారుల ఇళ్లకు సంబంధించిన తాళాలను అందజేశామన్నారు. అందులో 1,131 మంది లబ్ధిదారుల రిజిస్ట్రేషన్‌లు కూడా పూర్తి అయ్యాయన్నారు. 580 మందికి విద్యుత్ మీటర్లను మంజూరు చేశామన్నారు. 533 మంది మీటర్ల కోసం దరఖాస్తులు చేసుకున్నా, డబ్బులు చెల్లించలేదన్నారు. కనెక్షన్ తీసుకున్న లబ్ధిదారులు ఏడాదిన్నరగా విద్యుత్ బిల్లులు చెల్లించకపోవడంతో 200 మంది ఇళ్లకు సంబంధించిన కనెక్షన్లను కట్ చేసినట్లు చెప్పారు.

సస్యరక్షణతో తెగుళ్ల నివారణ

గోనెగండ్ల: రైతులు సాగుచేసిన పంటల్లో సస్యరక్షణ చేపట్టి పురుగు లక్షణాలు, ఉనికి ఉధృతిని బట్టి నివారణ చర్యలు తీసుకోవాలని ఏరువాక కేంద్రం కర్నూలు కోఆర్డినేటర్ సుజాత, డీఆర్సీ ఏడీఏ గిరీష్, ఎమ్మిగనూరు ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ తెలిపారు. శుక్రవారం గోనెగండ్లలో కంది, వేరుశనగ తదితర పంటలను పరిశీలించారు. కంది పంటలో కాయ ఈగ నివారణకు థయాక్లోప్రిడ్ 0.7 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు.

సమస్యలు పరిష్కరించాలి

ఆదోని సెంట్రల్: విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం యూటీఎఫ్ కార్యాలయంలో 28, 29, 30వ తేదీలలో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టనున్న ధర్నా పోస్టర్లను నాయకులు విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యారంగాన్ని కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని విమర్శించారు. పెండింగ్‌లో ఉన్న రూ. 3,480 కోట్లు విద్యాదీవెన, వసతి దీవేన నిధులను విడుదల చేయాలన్నారు. కార్యక్రమములో నాయకులు గౌస్, శశిధర్, మల్లికార్జున, లోకేష్, ఉచ్చిరప్ప,రాజు, ఫారిక్ భాష, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

అన్నా క్యాంటీన్‌ను పరిశీలించిన కమిషనర్

ఆదోని టౌన్: ఆదోని పట్టణంలోని శ్రీనివాసభవన్ వద్ద ఉన్న అన్నా క్యాంటీన్‌ను శుక్రవారం మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ, మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత పరిశీలించారు. ప్రజలకు స్వయంగా వారు భోజనాన్ని వడ్డిస్తూ భోజనం నాణ్యతపై ఆరా తీశారు. అన్నా క్యాంటీన్ ద్వారా అందిస్తున్న భోజనం, టిఫిన్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏవైనా సమస్యలు ఉంటే తమదృష్టికి తీసుకురావాలని సూచించారు. వీరి వెంట డీఈ రామ్మూర్తి, ఏఈ జనార్ధన్, సిబ్బంది ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ఎమ్మిగనూరుటౌన్: రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్ –17 కబడ్డీ పోటీలకు పట్టణంలోని ఎంఎస్ నగర్ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న బి. వినోద్ ఎంపికయ్యాడు.మండల,నియోజకవర్గ, జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి ఈ నెల 27న అన్నమయ్య జిల్లా రాయచోటిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు హెచ్‌ఎం శకుంతలమ్మ, పీడీ శ్రీనివాసులు తెలిపారు.

రాష్ట్ర స్థాయి షటిల్ పోటీలకు..

ఎమ్మిగనూరుటౌన్: ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి షటిల్ పోటీలకు పట్టణంలోని నారాయణ పాఠశాల విద్యార్థి ఎస్.సృజన్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సురేష్‌కుమార్, ఏజీఎం రమేష్‌కుమార్ తెలిపారు. ఈనెల 28న పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురంలో జరిగే రాష్ట్రస్థాయి షటిల్ పోటీల్లో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు.

న్యాయం చేయాలి

గోనెగండ్ల: కాటికాపరులను వృత్తిదారులుగా గుర్తించి నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని ఆ సంఘం నాయకులు సుంకన్న, జయరాజ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఎర్రబాడు సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి తోటయ్యకు వినతిపత్రం అందజేశారు.

భూసమస్యలకు పరిష్కారం

నందవరం: రైతులు భూ సమస్యల పరిష్కారానికి గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని జొహరాపురంలో గ్రామ సభ నిర్వహించారు. భూముల విస్తీర్ణం, ఎల్‌పీ నంబర్లు, అన్నదమ్ముల విభాగాలకు చెందిన సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. రీ సర్వే డీటీ మహేష్, ఆర్‌ఐ జెర్మియా, సర్వేయర్ అక్బర్‌బాషా పాల్గొన్నారు.